పనులు పూర్తికాక ... ముంపు సమస్య తీరక!

- జీఎస్‌రెడ్డినగర్‌లోని క్రిస్టల్ విల్లా వద్ద నిలిచిన వరదనీటి కాలువ పనులు
- వర్షం పడితే చెరువుల్లా మారుతున్న కింది కాలనీలు
- భయాందోళనలో ప్రజలు



క్రిస్టల్ విల్లా ఎదుట అసంపూర్తిగా వరద కాలువ పనులు

ఎల్‌బీనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ముంపు కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారం కోసం చేపట్టిన వరద కాలువ పనులు పూర్తి కాకపోవడంతో ఎప్పుడు తమ కాలనీని వరద ముంచెత్తుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సాగర్‌ఎన్‌క్లేవ్, బీఎన్‌రెడ్డినగర్‌లోని క్రిస్టల్ విల్లా వద్ద పనులు పూర్తికాక వరద నిలుస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

క్రిస్టల్‌విల్లా ముందు...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని గాయత్రీనగర్ ఫేజ్–4 వద్ద నుంచి క్రిస్టల్ విల్లా వరకు సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన వరదనీటి కాలువ పనులు పూర్తయ్యాయి. ఫేజ్–2 పనులు క్రిస్టల్‌విల్లా నుంచి మహాలక్ష్మీనగర్ కాలనీతో పాటు పరిసర కాలనీ నుంచి సాగే వరద నీటి కాలువ పనులకు కొన్ని రోజులుగా అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ కాలువ నిర్మాణాన్ని కొన్ని కాలునీలు వ్యతిరేకించడంతో అధికారులు క్రిస్టల్‌విల్లా వరకు పనులు పూర్తి చేసి అక్కడ నిలిపివేశారు. దీంతో ఆగకుండా 20 నిమిషాల పాటు వర్షం కురిస్తే చాలు...కింది కాలనీలు చెరువుల్లా మారుతున్నాయి. వరద నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్లలోతు గుంతలో నుంచే వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఎమ్మెల్యే ఆదేశించినా ఫలితం శూన్యం...

కాలనీలోని ముంపు సమస్య పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ కింద సుమారుగా రూ.1.50కోట్లు మంజూరయ్యాయి. గాయత్రీనగర్ ఫేజ్ 4 నుంచి పాపిరెడ్డికాలనీ మీదుగా నిర్మించిన పనులు పూర్తికాగా రెండోదశ పనులు మాత్రం క్రిస్టల్‌విల్లా వద్ద నిలిచిపోయాయి. ఈ పనులపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇటీవల ఎస్ఎన్‌డీపీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరగా ఈ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు అధికారులు ఈ పనులను ప్రారంభించలేదు. దీంతో వర్షం వస్తే ఇక్కడి కాలనీలు, రోడ్లు వరద నీటితో చెరువుల్లా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు వరద కాలువ పనులను పూర్తి చేయాలని పలువురు కాలనీ వాసులు కోరుతున్నారు.

కోర్టు కేసుల వల్లే పనులు ఆపేశాం

క్రిస్టల్ విల్లా నుంచి మహాలక్ష్మీనగర్ కాలనీతోపాటు ముంపు ప్రాంతాల వారు ఈ కాలువ పనులు తమ భూముల మీదుగా చేపట్టవద్దంటూ కోర్టుకు వెళ్లారు. దీంతో అక్కడ పనులు నిలిచిపోయాయి. కోర్టు తీర్పు రాగానే పనులు పునః ప్రారంభించి ముంపు సమస్య రాకుండా చూస్తాం.

– పవన్, ఇరిగేషన్ డీఈ

క్లుప్తంగా

రేపు తైబజార్ వేలం

మహేశ్వరం: మహేశ్వరం మండలం ఘట్టుపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయలు–పూజా సామగ్రి, పూల తైబజార్, మిఠాయి తైబజార్, గాజుల తైబజార్, బుక్క గులాల తైబజార్, హోటల్‌కు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చేయాలన్నారు. వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.

సొంత నిధులతో రోడ్ల చదును



మట్టిని చదును చేయిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ (26వ డివిజన్) శ్రీహోమ్స్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న యువజన కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి సొంత నిధులతో బుధవారం రోడ్లకు ఇరువైపులా మట్టిని పోయించి జేసీబీతో మరమ్మతులు చేయించారు. గుంతలను పూడ్చివేయించి సాఫీగా ప్రయాణం సాగేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డిని కాలనీవాసులు అభినందించారు.

ముగిసిన ఎల్లమ్మ కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ 40వ వార్షిక కల్యాణోత్సవాలు ముగిసాయి. బుధవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఏఈ శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పురుషోత్తం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ పేషీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడి 9 ఏళ్లు దాటినా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వెంటనే హామీలన్నీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, నాయకులు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ జోడో సమ్మేళన పాదయాత్ర

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కడ్తాల్‌లో భారత్ జోడో సమ్మేళన పాదయాత్ర నిర్వహిస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

8న ఉచిత వైద్యశిబిరం

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ నర్సింగ్‌హోం ఆవరణలో ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం(గుండె సంబంధిత వ్యాధులు) నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్ఓ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఈకో తదితర పరీక్షలు చేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని పాషా కోరారు.

అర్హులందరికీ రుణాలు అందిస్తాం

పీఏసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖర్



రుణాల పత్రాలను అందిస్తున్న చంద్రశేఖర్

కందుకూరు: అర్హులైన ప్రతి రైతుకు రుణాలు అందిస్తున్నామని పీఏసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మన్ విజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో 71 మంది రైతులకు మంజూరైన పంట రుణాలు రూ.50 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొసైటీ ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులకు ఈ సంవత్సరం రూ.10 కోట్ల వరకు రుణాలు అందించనున్నామన్నారు. 1070 మంది రైతులకు రూ.3.44కోట్లు పంట రుణమాఫీ నిధులు వచ్చాయన్నారు. సభ్యత్వం ఉన్న ప్రతి రైతు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌తో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలు కార్యాలయంలో ఇచ్చి తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు జి.అంజమ్మ, సాధ పాండురంగారెడ్డి, పి.ఆనంద్, సీఈఓ నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది



శేషమ్మను సన్మానిస్తున్న ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డ్ అందుకున్న శేషమ్మను బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. అలాగే, పాఠశాలలోని ఉపాధ్యాయులందరినీ సత్కరించారు. మధుర ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేది ఉపాధ్యాయులని అన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, నీక్యాత్ ,కవిత పాల్గొన్నారు.

చిత్రాలేవుట్ కాలనీలో...

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీ నివాసం ఉండే ఉపాధ్యాయులను మంగళవారం రాత్రి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గౌరవ అధ్యక్షుడు రేగట్టే సుధాకర్‌రెడ్డి ఇతర నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మర్రి సత్యనారాయణరెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీ కిషోర్‌రెడ్డి, దివాకర్‌రావు, సన్మాన గ్రహీతలు లింగారెడ్డి, రాఘవరెడ్డి, రఘునాథ్, సలీం, విజయలక్ష్మి, జ్యోతి, సరోజ, లక్ష్మి, హైమవతి, రంగారెడ్డి, శంకర్, శ్రీనివాస్, వెంకట రమణ, సుమ పాల్గొన్నారు.

మీర్‌పేట గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక



భిక్షపతికి నియామకపత్రం అందజేస్తున్న సభ్యులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ గణేశ్ ఉత్సవ కమిటీని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కోకన్వీనర్ సోమేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భిక్షపతిచారి, ప్రధాన కార్యదర్శులుగా భీంరాజ్, రవినాయక్, జంగారెడ్డి, కోశాధికారిగా కాశీరాం యాదవ్, ఉపాధ్యక్షులుగా జంగయ్యగౌడ్, అనిల్‌యాదవ్, హరినాథ్‌రెడ్డి, గోపియాదవ్, నర్సింహయాదవ్, శ్రీనివాస్‌గుప్తా, మధు, గోపినాథ్, కార్యదర్శులుగా పరమేశ్, దేవేందర్, వెంకటేష్, జగన్ ముదిరాజ్, రాజేష్, శ్యాంసుందర్, తుమ్మల రమేష్, పోరెడ్డి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్ ఎంపికయ్యారు. శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఐఆర్ (భృతి) కల్పించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ సీ.హెచ్.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే, తదితర సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలను కేటగిరీలవారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్లనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాసు, కార్మికులు.. నగేష్, యూనియన్ నాయకులు నవీన్ కుమార్, యాదగిరి, ప్రకాష్ కారత్, పి.జగన్, రవి చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేద్దాం



కడ్తాల్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పోచమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యంయాదవ్

కడ్తాల్: మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి నిర్వహించే బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పోచమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యంయాదవ్ కోరారు. బుధవారం స్థానిక పోచమ్మ తల్లి ఆలయం వద్ద బోనాల ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రాంచంద్రనాయక్, కార్తీక్, మాజీ సర్పంచ్ బీచ్యానాయక్, వార్డుసభ్యులు నరేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పాండుయాదవ్, శేఖర్‌రెడ్డి, నర్సింహ, శ్రీశైలం, రాములు, శంకరయ్య, ధశరథ్, రవి, వెంకటేశ్, భానుకిరణ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు రండి..

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి నిర్వహించే బోనాల వేడుకలకు రావాల్సిందిగా ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లును ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ వెంకటేశ్వర్లును ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానపత్రిక అందించారు. మండల గౌడసంఘం అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు చేగూరి రాములు, కార్తీక్, రవి తదితరులు ఉన్నారు.

యూఎల్‌సీ సమస్య పరిష్కారానికి కృషి



సీఎస్ శాంతికుమారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని పలుప్రాంతాల్లో ఉన్న యూఎల్‌సీ సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి యూఎల్‌సీ సమస్యను పరిష్కరించాలని సుధీర్‌రెడ్డి కోరారు. డివిజన్ పరిధిలోని ధాతునగర్‌లో 1505 చదరపు గజాల స్థలం యూఎల్‌సీలో ఉందని, అందులో దాదాపు 470 గజాల స్థలం రెగ్యులరైజేషన్ చేశారని, మిగతా స్థలం రెగ్యులరైజేషన్ చేయకపోవడంతో దాదాపు 254 మంది ఇళ్లకు సెక్షన్22ఏ ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగడంలేదన్నారు. దీంతో ఆ స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు రావడంలేదన్నారు. వెంటనే అధికారులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీఎస్‌ను కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమిని పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గవ్యాప్తంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు గ్రామాల్లో భక్తులు ఉట్లు కొట్టి సందడి చేశారు. పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బడంగ్‌పేట: వేడుకల్లో చిన్నారులు



మహేశ్వరం: నాగారంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



కందుకూరు: కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు



తుక్కుగూడ: కృష్ణుడి వేషధారణలో బాలుడు



మీర్‌పేట: కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

పరిశుభ్రతపై అవగాహన

తలకొండపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీఓ రఘుతో కలిసి ఉప సర్పంచ్ పర్యటించారు. మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యదర్శి రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లి, పోలెపల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను బుధవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. అధిక దిగుబడులకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివతేజ, రైతులు లక్ష్మమ్మ, అంతమ్మ, అడివమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన రాజు ఇటీవల మృతిచెందాడు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా బుధవారం రూ.3000 ట్రస్టు సభ్యులచే అందజేశారు. అలాగే స్థానిక నాయకుడు శ్రీశైలం రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.5వేలు అందజేత..

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ యాసీన్ కుమారుడు సలీమ్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ పరామర్శించారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ రూ.3వేలు సాయం అందించారు. కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి



యాచారం: అభిషేక్‌రెడ్డిని సన్మానించిన నేతలు

యాచారం: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లాగా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. పార్టీ శ్రేణులు కష్టపడితే భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, అమృతాసాగర్, మాధవి, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, జగదీష్ రావు, మల్లేష్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే గెలుపు..

తలకొండపల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలుపించేందుకు సిద్ధంగా ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో 90 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కొలను శివారెడ్డికాలనీ వాసులు

మన్సూరాబాద్: కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని కొలను శివారెడ్డినగర్ కాలనీవాసులు బుధవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొలను నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీవాసులు నందగోపాల్‌రెడ్డి, చంద్రయ్య, జన్నెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.